# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 35 | సంపుటి : 3 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మే సోమవారం | 5-5-2025 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.




## భూభారతి రైతులకు రక్షణ కవచం

- నేటి నుంచి 28 మండలాల్లో రెండో విడత
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్ మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన భూ భారతి చట్టం- 2025 రైతులకు రక్షణ కవచమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రెండో విడుతలో నేటి నుంచి రాష్ట్రంలోని 28 మండలాల్లో భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. గత నెల 17నుంచి 30వరకు నాలుగు జిల్లాల్లోని నాలుగు మండలాల్లో మొదటి

-మిగతా 2 లో



## శ్రీవారికి మరో భారీ విరాళం..

### 1.50 కోట్ల చెక్‌ను అందచేసిన బెంగుళూరు వ్యాపారి

**హైదరాబాద్, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తిరుమలలో శ్రీవారికి ఆదివారం భారీ విరాళం అందింది. బెంగుళూరుకు చెందిన ఓ వ్యాపార సంస్థ టీటీడీకి రూ.1.50 కోట్లు విరాళంగా ప్రకటించింది. టీటీడీ ఆధ్వర్యంలో నడిచే ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు బెంగుళూరుకు చెందిన సుయూగ్ వెంచర్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థ ఈ విరాళం అందించింది. ఈ మేరకు ఆ సంస్థ చైర్మన్ యతీశ్ సూరినేని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడును ఆదివారం కలిసి విరాళం చెక్కును అందచేశారు.

## మావోయిస్టులతో మాటల్లేవ్

### తుపాకీ వీడాలి



- బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటే
- కేంద్రం కుల గణన నిర్ణయం చారిత్రాత్మకం
- రాష్ట్రంలో బీసీలను తగ్గించి చూపించారు
- కాళేశ్వరంపై ఎన్డీఎస్ఏ నివేదికలిచ్చినా చర్యలెందుకు తీసుకోలేదు
- కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**కరీంనగర్ మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మావోయిస్టులతో చర్చలకు తావే లేదని, నిషేధిత సంస్థతో సంభాషణ అనే ఆలోచన దారుణమని కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై ఘాటుగా స్పందించారు. తుపాకీతో అమాయకులను, గిరిజనులను కాల్చి చంపుతున్నవాళ్లను సామాజిక కోణంతో చూడాలంటారా..

-మిగతా 2 లో



## అణుబాంబులతో దాడి చేస్తాం..

### రష్యాలోని పాక్ రాయబారి బెదిరింపులు

**న్యూఢిల్లీ, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాకిస్థాన్-భారత్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉన్న క్రమంలో రష్యాలోని పాకిస్థాన్ రాయబారి బహిరంగ బెదిరింపులకు దిగారు. ఒక వేళ పాక్‌పై కనుక న్యూఢిల్లీ దాడికి దిగితే అణ్వాయుధాలు సహా పూర్తి స్థాయి శక్తులను వినియోగించి ఇస్లామాబాద్ ప్రతిఘటనకు దిగుతుందని మహమ్మద్ ఖలీద్ జమాలి హెచ్చరించారు.

-మిగతా 2 లో



## ప్రధాని మోడీతో ఎయిర్ చీఫ్ మార్షల్ భేటీ

### భారత్-పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై చర్చ

**న్యూఢిల్లీ** ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో ఆదివారం వైమానిక దళాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఎపి సింగ్ సమావేశమయ్యారు. ఈ సమావేశంలో పహెల్గాం ఉగ్రదాడి కారణంగా భారత్-పాకిస్తాన్ మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై చర్చించినట్లు సమాచారం. ఎయిర్ చీఫ్ మార్షల్,

-మిగతా 2 లో

## ఈ నెల 8 వరకు వర్షసూచన

- నేడు, రేపు పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక

**హైదరాబాద్ మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్రంలో ఈ నెల ఎనిమిదో తేదీ వరకు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఈదురుగాలులతో (గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో) కూడిన వర్షం పడే సూచనలున్నాయనీ,

-మిగతా 2 లో





## 17 నెలల్లో 17 పైసలియ్యలే!


- 'ఫీజు' రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఎప్పుడు చెల్లిస్తారు?
- సర్కారు నిర్లక్ష్యం.. విద్యార్థులకు శాపం
- కాలేజీలు మూతపడే ప్రమాదం
- లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరం
- ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కండ్లు తెరవాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు ఫైర్

**హైదరాబాద్, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ 17 నెలల్లో విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద కనీసం 17 పైసలు కూడా చెల్లించలేదని మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజమెత్తారు. బడా కాంట్రాక్టర్లకు వేలకోట్ల బిల్లులు చెల్లించిన ప్రభుత్వం.. విద్యార్థుల కోసం ఫీజు బకాయిలు ఎందుకివ్వడం లేదని ప్రశ్నించారు.

-మిగతా 2 లో

## మీరు కోరుకునేదే జరుగుతుంది

### పాక్‌తో ఉద్రిక్తతల వేళ రాజ్‌నాథ్ ఆసక్తికర వ్యాఖ్యలు..!



- భారత్‌పై దాడికి ప్రయత్నించేవారికి సరైన సమాధానం చెబుతాం
- దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడడం నా బాధ్యత
- 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యం

**న్యూఢిల్లీ మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రికత్తలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై దాడికి ప్రయత్నించేవారికి సరైన సమాధానం చెబుతామన్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడుకోవడం రక్షణమంత్రిగా తన బాధ్యత అన్నారు. ప్రధాని మోదీ పనితీరు. పట్టుదల గురించి అందరికీ ఈ విషయం తెలుసునని.. ఆయన నాయకత్వంలో ప్రజలు కోరుకున్నది కచ్చితంగా జరుగుతుందని.. ఈ విషయంలో తాను హామీ ఇస్తున్నానంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో

-మిగతా 2 లో

## బద్రీనాథ్ ఆలయంలో పూజలు ప్రారంభం



**బద్రీనాథ్‌మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చార్‌ధామ్ యాత్రలో భాగమైన బద్రీనాథ్ దేవాలయాన్ని భక్తుల కోసం ఆదివారం ఉదయం 6 గంటలకు తెరిచారు. వేద మంత్రోచ్చారణల

-మిగతా 2 లో

## బీఎస్ఎఫ్‌కు 16 కొత్త బెటాలియన్లు

### 17 వేల మంది చేరికకు రంగం సిద్ధం



**న్యూఢిల్లీ మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** భారత సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) మరింత పటిష్ఠం కానుంది. 17 వేల మందితో కూడిన 16 బెటాలియన్‌లను అదనంగా చేర్చడానికి

-మిగతా 2 లో

# భూభారతి రైతులకు రక్షణ కవచం

(మొదటి తరువాయి)

విడత నిర్వహించిన మాదిరిగానే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ చట్టం రాష్ట్రంలో విప్లవాత్మక మార్పునకు నాంది పలకబోతోందని అన్నారు. భూ భారతి చట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోందని చెప్పారు. ఇక నుంచి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయాల్లోనే వారి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించడంతోపాటు ఆయా మండలాల్లో భూ సమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిష్కరించనున్నట్టు తెలిపారు. ప్రతి కలెక్టర్ రెవెన్యూ సదస్సులకు హాజరై రైతులు, ప్రజలు లేవనెత్తే సందేహాలను వారికి అర్థమయ్యే భాషలో వివరించి పరిష్కారం చూపుతారని పేర్కొన్నారు. భూ భారతి చట్టాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు.

**రెండో విడతలో**

ఆదిలాబాద్ జిల్లా భరోజ్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్, హన్మకొండ జిల్లా నడికుడ, జగిత్యాల జిల్లా బుగ్గారం, జనగాం జిల్లా ఘన్‌పూర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ, జోగులాంబ గద్వాల్ జిల్లా ఇటిక్యాల్, కరీంనగర్ జిల్లా సైదాపూర్, కొమరంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట్, మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లె, మహబూబ్ నగర్ జిల్లా మూసాపేట్, మంచిర్యాల జిల్లా భీమారం, మెదక్ జిల్లా చిల్పిచెడ్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కీసర, నాగర్‌కర్నూల్ జిల్లా పెంట్లవల్లి, నల్గొండ జిల్లా నకిరేకల్, నిర్మల్ జిల్లా కుంతాల, నిజామాబాద్ జిల్లా మెండోరా, పెద్దపల్లి జిల్లా ఎలిగేడ్, రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి, రంగారెడ్డి జిల్లా కుందుర్గ్, సంగారెడ్డి జిల్లా కొండాపూర్, సిద్దిపేట జిల్లా అక్కన్నపేట, సూర్యాపేట జిల్లా గరిడేపల్లె, వికారాబాద్ జిల్లా ధరూర్, వనపర్తి జిల్లా గోపాలపేట, వరంగల్ జిల్లా వర్ధన్నపేట్, యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్ మండలాల్లో నేటి నుంచి భూ భారతి అమలు కానుంది.

# మావోయిస్టులతో మాటల్లేవ్

(మొదటి తరువాయి)

ఇది ఎలాంటి నైతికత అని అన్నారు. మావోయిస్టులపై నిషేధం విధించింది కాంగ్రెస్ అని, ఇప్పుడు అదే పార్టీ నేతలు చర్చలు జరపాలని మాట్లాడటం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. అసలు మావోయిస్టులపై నిషేధాన్ని ఎత్తివేయగల ధైర్యం కాంగ్రెస్ సర్కార్‌కు ఉందా అని ప్రశ్నించారు. గతంలో మావోయిస్టులు కాంగ్రెస్, బీజేపీ, టీడీపీ నాయకుల్ని సహా ఎన్నో హత్యలు చేశారని తెలిపారు. గిరిజనుల్ని, పోలీసులను బాంబులతో, తుపాకులతో చంపినవాళ్లతో ప్రభుత్వం చర్చలు జరపాలనుకోవడమే మానవత్వానికి, ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు. రోహింగ్యాల సమస్యపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న అలసత్వంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. పాస్‌పోర్టు, వీసా లేని విదేశీయులను గుర్తించి పంపించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని తెలిపారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం తూతూ మంత్రంగా వ్యవహరిస్తోందని, ఇది దేశ భద్రతకు ముప్పుగా మారవచ్చన్నారు. కాళేశ్వరం నీటి ప్రాజెక్టుపై ఎన్డీఎస్ఏ నివేదిక వచ్చిందని, అయినా చర్యలు తీసుకోని ప్రభుత్వం ప్రజలను మభ్యపెడుతోందన్నారు. బీఆర్ఎస్ అవినీతికి కాంగ్రెస్ అండగా మారిందని, రెండు పార్టీలు కలసి మావోయిస్టులతో చర్చలు అంటూ ప్రజా సమస్యల నుంచి దృష్టి మళ్లించే ప్రయత్నంలో ఉన్నాయన్నారు. మోడీ ప్రభుత్వం చేపట్టిన కులగణన చారిత్రాత్మకమని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేసిన సర్వేలో బీసీ జనాభాను తక్కువగా చూపించారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం అన్ని వ్యవహారాల్లో విఫలమైందని, ఆరు గ్యారంటీల అమలుపై డమ్మీ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రసక్తే లేదని, వారు తుపాకీ వదిలి పోలీసులకు లొంగిపోవాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాసాల రమేష్, మాజీ మేయర్ సునీల్ రావు, కొత్తపల్లి మాజీ మున్సిపల్ చైర్మెన్ రుద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

# 17 నెలల్లో 17 పైసలియ్యలే!

(మొదటి తరువాయి)

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి.. విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆదివారం ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తంచేశారు. పేద విద్యార్థుల అభ్యున్నతి కోసం ఈ పథకాన్ని కేసీఆర్ అమలు చేస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తూట్లు పొడుస్తున్నదని నిప్పులు చెరిగారు. డిగ్రీ కాలేజీలకు రూ.800 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో 6 లక్షల మంది విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందని ఆందోళన వ్యక్తంచేశారు.'విద్యార్థులే పరీక్షలు పెట్టాలని వేడుకునే దుస్థితి నెలకొనడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం కాదా ఏప్రిల్‌లో జరగాల్సిన పరీక్షలను శాతవాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ సహా కొన్ని యూనివర్సిటీల పరిధిలో ఇప్పటికీ నిర్వహించకపోవడం సర్కారు చేతగానితనానికి నిదర్శనం కాదా?' అని ప్రశ్నించారు. సకాలంలో పరీక్షలు పెట్టకపోవడంతో డిగ్రీ ఫైనలియర్ విద్యార్థులు లా, పీజీ సెట్లు, ఇతర పోటీ పరీక్షలు రాసే అవకాశం




కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

**మొద్దునిద్ర నటిస్తున్న సర్కారు**

ప్రైవేట్ డిగ్రీ కాలేజీల యాజమాన్యాలు పరీక్షలను పక్కనబెట్టి నిరసనలకు దిగుతుంటే ప్రభుత్వం మాత్రం మొద్దునిద్ర నటిస్తున్నదని ధ్వజమెత్తారు. కాలేజీల యాజమాన్యాలు అప్పుల ఊబిలో కూరుకుపోయి సిబ్బందికి జీతాలివ్వలేని దారుణ పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు. అద్దెలు, అప్పులభారం భరించలేక కొన్ని కాలేజీలు అడ్మిషన్లనే నిలిపివేశాయని, మరికొన్ని తాళాలు వేసి సెలవులు ప్రకటించాయని తెలిపారు. ఇంత జరుగుతున్నా ముఖ్యమంత్రి, మంత్రులు ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రతి విద్యార్థికి రూ.5 లక్షల చొప్పున విద్యాభరోసా కార్డులు ఇస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వ హామీకి అతీగతీలేకుండా పోయిందని హరీశ్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా కండ్లు తెరిచి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# మీరు కోరుకునేదే జరుగుతుంది..

(మొదటి తరువాయి)

సంస్కృతి జాగరణ్ మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ పాల్గొని సంచలన వ్యాఖ్యలు చేశారు. సైనికులు దేశ భౌతిక స్వరూపాన్ని కాపాడుతున్నారని.. మరో వైపు రుషులు, జ్ఞానులు దేశ ఆధ్యాత్మిక రూపాన్ని పరిరక్షిస్తున్నారని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. ఓ వైపు సైనికులు యుద్ధ భూమిపై పోరాడుతుంటే.. సాధువులు జీవన భూమిపై పోరాడుతున్నారన్నారు. దేశ సరిహద్దుల భద్రతతో పాటు సైనికులను కాపాడడం తన బాధ్యత అని, దేశంపై దాడికి ప్రయత్నించేవారికి సరైన రీతిలో సమాధానం ఇవ్వడం తన విధి అన్నారు. మన ప్రధాని గురించి మీ అందరికీ తెలుసు. ఆయన పని విధానం, పట్టుదల ఏంటే తెలుసునని.. ఆయన సారథ్యంలో మీరంతా కోరుకునేది కచ్చితంగా జరుగుతుందని హామీ ఇస్తున్నానన్నారు. భారత్ శక్తి సాయుధ దళాల్లోనే కాకుండా.. సంస్కృతి, ఆధ్యాత్మికతలోనూ ఉందని రాజ్‌నాథ్ వ్యాఖ్యానించారు. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. ఇది చిన్న లక్ష్యం కాదనన్నారు. ప్రపంచంలో భారతదేశం ప్రతిష్ట పెరిగిందనే వాస్తవాన్ని అందరూ అంగీకరిస్తారని.. ఈ కాబట్టి ఈ లక్ష్యం సాధ్యమవుతుందన్నారు. ఇదిలా ఉండగా.. రాజ్‌నాథ్ సింగ్ సోమవారం ఢిల్లీలో జపాన్ రక్షణ మంత్రి ద్వైపాక్షిక సమావేశం నిర్వహించనున్నారు. అంతర్జాతీయ భద్రతా పరిస్థితులపై చర్చించడం, ద్వైపాక్షిక రక్షణ సహకారంపై ఇద్దరు నేతలు చర్చించనున్నారు. భారత్-పాకిస్తాన్ మధ్య ఉద్రిక్తత వాతావరణం నెలకొన్న సమయంలోనే ఈ భేటీ జరుగనున్నది. భారత్-జపాన్ మధ్య ఇప్పటికే మంచి స్నేహం ఉన్నది. ఇద్దరు నేతలు చివరిసారిగా గతేడాది నవంబర్‌లో లావో పీడీఆర్‌లో జరిగిన ఏషియన్ రక్షణమంత్రుల సమావేశంలో కలిశారు. ఆ సమయంలో ద్వైపాక్షిక రక్షణ, సాంకేతిక సహకారంపై చర్చించారు.

# హైటెక్ తరహాలో ములుగు 'బస్టాండ్'

## మంత్రి పొన్నం ప్రభాకర్

**ములుగు**

ములుగు జిల్లాలో హైటెక్ తరహాలో నిర్మించనున్న నూతన బస్టాండ్‌ను ఆరు నెలల్లోపు పూర్తి చేసి ప్రారంభించి జిల్లా ప్రజల దశాబ్దాల కలను నెరవేరుస్తామని రోడ్డు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాలన్నింటికీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివారం ములుగు జిల్లాకు చేరుకున్న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గట్టమ్మ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మంత్రులు భారీ ర్యాలీగా జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. అనంతరం మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్‌తో కలిసి రూ.4.80కోట్లతో చేపట్టనున్న నూతన బస్టాండ్ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. తామిచ్చిన హామీలనే కాకుండా నూతన పథకాలనూ అమలు చేస్తున్నామని తెలిపారు. జిల్లా కేంద్రంలో 1989లో నిర్మించిన బస్టాండ్ పరిస్థితి బాగాలేదని మంత్రి సీతక్క తెలుపగానే నూతన బస్టాండ్ నిర్మాణానికి నిధులు కేటాయించామని చెప్పారు. మంగపేట మండలంలో రూ.50 లక్షలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని అన్నారు. రానున్న రోజుల్లో మంగపేట మండల కేంద్రంలో రూ.7కోట్లతో చేపట్టనున్న బస్ డిపో పనులకు శంకుస్థాపన చేస్తామని తెలిపారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని ప్రేమనగర్ వద్ద గిరిజన యూనివర్సిటీ, సమీకృత కలెక్టరేట్, వైద్య కళాశాల ఉన్న కారణంగా ఎకరం స్థలంలో నూతన బస్టాండ్ నిర్మాణ పనులను చేపట్టనున్నట్టు హామీ ఇచ్చారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడానికి మహిళా సంఘాలతో 600 బస్సులను కొనుగోలు చేసి బస్సు యజమానులుగా చేశామని అన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ.. బీసీ సంక్షేమ శాఖ మంత్రి నేడు రాష్ట్రంలో బీసీల పాలిట దేవుడుగా మారి 42 శాతం రిజర్వేషన్ సాధించడం గొప్ప విషయమని అన్నారు.

### అణుబాంబులతో
# దాడి చేస్తాం..

(మొదటి తరువాయి)

రష్యాకు చెందిన ఆర్‌టీ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'భారత దేశ ఉన్మాద మీడియా, బాధ్యతారాహిత్యమైన ప్రకటనలు మమ్మల్ని ఆ దిశగా బలవంతం చేశాయి. పాక్‌లోని కొన్ని ప్రాంతాలు లక్ష్యంగా దాడులు చేయాలని భారత్ నిర్ణయించినట్టు కొన్ని లీకైన డాక్యుమెంట్ల ద్వారా వెల్లడైంది. కాబట్టి ఇది జరగబోతున్నదని, ఇది ఆసన్నమైందని మేము భావిస్తున్నాం' అని ఆయన అన్నారు. అదే పరిస్థితి ఏర్పడితే తాము సంఖ్యాబలం గురించి ఆలోచించమని, తమ సంప్రదాయ, అణు శక్తి రెండింటినీ పూర్తి స్థాయిలో వినియోగిస్తామని ఆయన తెలిపారు. ప్రజల నుంచి పూర్తి మద్దతు ఉన్న పాకిస్థాన్ ఆర్మీ అన్నింటికీ సన్నద్ధమై ఉందని ఆయన చెప్పారు.

### ప్రధాని మోడీతో ఎయిర్
# చీఫ్ మార్షల్ భేటీ

(మొదటి తరువాయి)

ప్రధాని మధ్య సమావేశం జరిగినట్లు సంబంధిత అధికారులు ధ్రువీకరించారు. అయితే మరింత సమాచారం ఇవ్వడానికి అధికారులు నిరాకరించారు. కాగా, శనివారం భారత నౌకాదళపతి నేవీ చీఫ్ అడ్మిరల్ దినేష్ కె. త్రిపాఠి ప్రధానమంత్రితో సమావేశమైన సంగతి తెలిసిందే. నౌకాదళపతితో సమావేశం జరిగిన 24 గంటల వ్యవధిలోనే వైమానిక దళాధిపతితో కూడా ప్రధాని సమావేశం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక గతవారంలో ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద ద్వివేదితో మోడీ సమావేశమయ్యారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడిలో 26 మంది మరణించిన తరువాత ఈ దాడిలో పాల్గన్న వారిని కఠినంగా శిక్షిస్తామని భారత్ హెచ్చరించింది. ఏప్రిల్ 29న అత్యున్నత రక్షణాధికారులతో జరిగిన ఉన్నతస్థాయి సమావేశంలో మోడీ మట్లాడుతూ పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిస్పందన విధానం, లక్ష్యాలు, కాల వ్యవధి నిర్ణయించుకోవడంలో సాయుధ దళాలకు 'పూర్తి కార్యాచరణ స్వేచ్ఛ'ను ప్రకటించారు. వీటితో పాటు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేయడం, అట్టారి వద్ద అంతర్జాతీయ క్రాసింగ్‌ను మూసివేయడం, దౌత్య సంబంధాలను తగ్గించడం వంటి చర్యలనూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

# ఈ నెల 8 వరకు వర్షసూచన

(మొదటి తరువాయి)

అదే సమయంలో అక్కడక్కడా వడగండ్లు పడే అవకాశముందని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే పలు జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరిక జారీ చేశారు. ఆ జాబితాలో ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలున్నాయి. మిగతా జిల్లాల్లోనూ అక్కడక్కడా వర్షం కురిసే అవకాశముంది. ఈ నేపథ్యంలో ఎల్లో హెచ్చరిక జారీ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముంది. వర్షాల నేపథ్యంలో వాతావరణం చల్లబడటంతో గరిష్ట ఉష్ణోగ్రతలు కూడా తగ్గుముఖం పట్టాయి. ఆదివారం రాత్రి పది గంటల వరకు రాష్ట్రంలో వందకుపైగా ప్రాంతాల్లో వర్షం పడింది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం గంగారం గ్రామంలో అత్యధికంగా 5 సెంటీమీటర్ల వాన పడింది.

# బద్రీనాథ్ ఆలయంలో పూజలు ప్రారంభం

(మొదటి తరువాయి)

నడుమ దేవాలయం తలుపులను తెరిచారు. భక్తులపైన 10 నిమిషాలపాటు హెలికాప్టర్ ద్వారా పూల వర్షం కురిపించారు. భక్తులు 'జై బదరీ విశాల్' అంటూ నినాదాలు చేశారు. భారత సైన్యం బ్యాండ్ భక్తి సంగీతాన్ని వినిపించింది. మన, బేమ్నీ గ్రామాల నుంచి వచ్చిన మహిళలు ఝుమైలో నృత్యం చేశారు. ఇతర రాష్ట్రాల భక్తులు భజనలు చేశారు. 15 టన్నుల రకరకాల పూలతో దేవాలయాలను అలంకరించారు.

# బీఎస్ఎఫ్‌కు 16 కొత్త బెటాలియన్లు

(మొదటి తరువాయి)



బీఎస్ఎఫ్ సిద్ధమవుతున్నది. ఇప్పటికే 193 బెటాలియన్లతో ఉన్న బీఎస్ఎఫ్ శక్తి సుమారు 2.70 లక్షలకు చేరనుంది. అలాగే పాకిస్థాన్, బంగ్లాదేశ్ సరిహద్దులను కాపాడటానికి వరుసగా పశ్చిమ, తూర్పు కమాండ్‌ల కోసం రెండు ఫార్వర్డ్ హెడ్ క్వార్టర్‌లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం నుంచి తుది అనుమతి పొందేందుకు సిద్ధంగా ఉందని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ప్రణాళికలకు ఇప్పటికే సూత్రప్రాయ ఆమోదం లభించింది. ప్రస్తుతం మన పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్ సరిహద్దుల నుంచి నిత్యం సవాళ్లు ఎదురవుతున్న క్రమంలో బీఎస్ఎఫ్ పటిష్ఠతకు ఈ కొత్త బెటాలియన్లు ఎంతో ఉపయోగపడతాయని భావిస్తున్నారు. కేంద్రం ఏర్పాటు చేయనున్న రెండు కమాండ్ బేస్‌లలో ఒకటి జమ్ములో, రెండోది బంగ్లాదేశ్ సరిహద్దు నిఘాకు మిజోరంలో ఏర్పాటు చేస్తారు.

## 2025 మే 5, సోమవారం తెలుగు పంచాంగం



మాసం -పక్షం
మాసం: వైశాఖమాసం (అమాంత)
పక్షం: శుక్లపక్షం
తిథి
అష్టమి: మే 4, సాయంత్రం 6:43 నుండి మే 5, సాయంత్రం 5:48 వరకు
నవమి: మే 5, సాయంత్రం 5:48 నుండి మే 6, సాయంత్రం 5:06 వరకు
నక్షత్రం
ఆశ్లేష: మే 4, మధ్యాహ్నం 12:17 నుండి మే 5, మధ్యాహ్నం 12:04 వరకు
మఖ: మే 5, మధ్యాహ్నం 12:04 నుండి మే 6, మధ్యాహ్నం 12:03 వరకు
సూర్యోదయం -సూర్యాస్తమయం
సూర్యోదయం: ఉదయం 5:51
సూర్యాస్తమయం: సాయంత్రం 6:33
చంద్రోదయం - చంద్రాస్తమయం
చంద్రోదయం: మధ్యాహ్నం 2:22
చంద్రాస్తమయం: మే 6, తెల్లవారుజామున 3:33
శుభ సమయాలు
బ్రహ్మ ముహూర్తం: ఉదయం 4:14 - 5:01
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 11:47 - 12:38
అమృతకాలం: మధ్యాహ్నం 2:35 - 4:09
అశుభ సమయాలు
రాహుకాలం: ఉదయం 7:26 - 9:01
యమగండం: మధ్యాహ్నం 1:48 - 3:23
దుర్ముహూర్తం:
ఉదయం 11:04 - 11:55
సాయంత్రం 3:19 - 4:09
వర్జ్యం: మధ్యాహ్నం 2:35 - 4:09

# ఎంపీ వద్దిరాజు ఆశీస్సులు



**హైదరాబాద్, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మొత్తం 470 మార్కులకు గాను 460 మార్కులు సాధించిన అర్చనను రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అభినందించి తన ఆశీస్సులు అందజేశారు.ఎంపీ రవిచంద్ర పీఏగా వరంగల్ లో పనిచేస్తున్న వీణవంక కిరణ్ కుమార్ కూతురు అర్చన హన్మకొండ నయీం నగర్ లోని రీజొనెన్స్ జూనియర్ కాలేజీలో చదువుతూ ఏంపీసీ మొదటి సంవత్సరంలో అత్యుత్తమ మార్కులు సాధించారు.ఈ సందర్భంగా కిరణ్ తన సతీమణి కావ్యశ్రీ, కూతురు అర్చన, కుమారుడు ప్రనూన్ తో పాటు ఆదివారం ఉదయం ఎంపీ రవిచంద్రను కలిసి తిరుపతి శ్రీవెంకటేశ్వర స్వామి ప్రసాదాన్ని అందజేశారు.ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో తన కూతురు సాధించిన మార్కుల గురించి తెల్పగా ఎంపీ రవిచంద్ర అర్చనకు శుభాకాంక్షలు చెప్పి ఆశీర్వదించారు.

# వేసవిలో రైతులకు ఉచిత భోజన వసతి

### - ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ గీతా నరసింహ



**ఆమనగల్లు, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** వేసవి తీవ్రతలో మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చే రైతులకు భోజన సదుపాయం కల్పిస్తూ ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఓ చక్కటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ యాట గీతా నరసింహ. ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సోమవారం నుంచే భోజన వసతిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రైతులు భౌతికంగా ఇబ్బంది పడకుండా, మధ్యాహ్న భోజన సమయాన సౌకర్యంగా ఉండేందుకు సొంత ఖర్చులతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన రైతులు, వారి వెంట వచ్చేవారు కూడా ఈ వసతిని వినియోగించుకోవచ్చన్నారు. మార్కెట్ యార్డు ఆవరణలో ప్రతిరోజూ మధ్యాహ్నం భోజనాన్ని అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. భోజనం మాత్రమే కాకుండా తాగునీటి వసతిని కూడా ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వేసవిలో రైతుల కష్టాలను తేలిక చేసేలా వీలైనన్ని సౌకర్యాలను కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. అకాల వర్షాల కారణంగా ధాన్యం తడవకుండా టార్పాలిన్ షీట్లు ముందుగా అందుబాటులో ఉంచామని తెలిపారు. మార్కెట్ పరిధిలోని అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసినట్లు చెప్పారు. రైతుల సంక్షేమమే లక్ష్యంగా మార్కెట్ కమిటీ కృషి చేస్తోందని, ఏ విషయంలోనైనా సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని గీతా నరసింహ స్పష్టం చేశారు.

# కార్మిక సంఘాల సార్వత్రిక సమ్మెకు సిపిఎం పార్టీ మద్దతు





### -సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ

**కల్వకుర్తి, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన జాన్ వెస్లీ తొలిసారిగా నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమావేశానికి వెళుతున్న సందర్భంగా కల్వకుర్తిలో యూటీఎఫ్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఈ సందర్భంగా జాన్ వెస్లీ మాట్లాడుతూ దేశంలో మతోన్మాదం కులతత్వం ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి లక్షకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లేదని అదేవిధంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల కు ఉపాధి హామీ పథకానికి నిధులు తగ్గిస్తూ వస్తుందని కేంద్ర ప్రభుత్వం అదేవిధంగా కార్మిక వర్గానికి తీవ్రంగా నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్లు తీసుకొచ్చి 8 గంటలకు బదులు రోజు 12 గంటలు పని చేయాలని చెబుతున్నారని విద్య వైద్యం వ్యాపార మయమైందని అన్నారు. విద్యా వైద్యం ఉచితంగా ఇవ్వాలంటే ఆర్థిక అసమానతలు అణచివేత లేని వ్యవస్థ ఒక సోషలిస్టు వ్యవస్థలోనే సాధ్యమవుతుందని అనేక ఆంక్షలు ఎదుర్కొంటున్న సోషలిస్టు దేశం చిన్న దేశం క్యూబా పూర్తిగా వైద్యం ఉచితంగా అందిస్తుందని అన్నారు. ఉన్న చట్టాలు అమలు చేయడం దోపిడీ వర్గాల నాయకత్వంలో ఉన్న ప్రభుత్వాల వల్ల కాదని కుల అసమానతలు ఆర్థిక అసమానతలు స్త్రీ పురుష అసమానతలు ఆధిపత్యం అంటరానితనానికి వ్యతిరేకంగా ఈ దేశంలో పోరాడేందుకే ఎర్రజెండా పేదల పక్షాన నిలబడుతుందని కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా దేశంలోని అన్ని కార్మిక సంఘాలు ఈ నెల 20వ తేదీన చేపట్టే సార్వత్రిక మ్మెకు సిపిఎం పార్టీ మద్దతిస్తుందని అన్నారు.సిపిఎం పార్టీ నాయకులు మరియు యూటీఎఫ్ బాలోత్సవ కమిటీ సిఐటియు భవన నిర్మాణ కార్మిక సంఘం కేవీపీస్ ప్రజానాట్యమండలి బీసీ సబ్ ప్లాన్ కమిటీ వివిధ ప్రజాసంఘాల నాయకులు పూలమాల శాలువాలతో ఘనంగా జాన్ వెస్లీ గారిని ఘనంగా సన్మానించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి. ఆంజనేయులు జిల్లా కమిటీ సభ్యులు ఏపీ.మల్లయ్య, పరశురాములు బాలస్వామి, శివరాములు భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు నాయకులు రాజు యాదయ్య దర్శన్ రెడ్డి వెంకటయ్య యుటిఎఫ్ నాయకులు చిన్నయ్య వెంకటేశ్వర్లు నెహ్రూ ప్రసాద్ వాలోత్సవ కమిటీ కన్వీనర్ చిన్నయ్య కోకన్వీనర్ వెంకటయ్య బీసీ సబ్ ప్లాన్ నాయకులు రాజేందర్ గోపాల్ జెఏసీ చైర్మన్ సదానందం ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు రాము జిల్లా కన్వీనర్ జగన్ విజయ్ పరశురాం సిపిఐ నాయకులు పరశురాములు గెజిటెడ్ హెడ్మాస్టర్ల సంఘం రాష్ట్ర నాయకులు సర్దార్ యుటిఎఫ్ మహిళా నాయకురాలు శశికళ దేవి, కే.పద్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

### భక్తుల ఉత్సాహం మధ్య వైభవంగా వేడుకలు



**దేవరకొండ, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** పట్టణంలోని గొల్లగూడెం, నసర్లబాయి తండాలో వెలసిన పురాతన శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ మహోత్సవాన్ని ఆలయ పెద్దలు, అర్చకులు, పురోహితులు, స్థానిక పెద్దల ఆధ్వర్యంలో అత్యంత భక్తి పారవశ్యంతో జరిపారు. తొమ్మిది రోజులపాటు భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ, నియమనిష్ఠలతో పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆరంభంలో గణపతి పూజతో వేడుకలు ప్రారంభమై, ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, భక్తిశ్రద్ధలతో నిత్య పూజలు కొనసాగాయి. మహోత్సవానికి ప్రముఖ వేద పండితులు హాజరై వేద మంత్రోచ్చారణల నడుమ ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. అత్యంత శ్రద్ధతో క్రేన్ సహాయంతో ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించగా, భక్తులు నవధాన్యాలు, పసుపు, కుంకుమ, కొబ్బరికాయలతో విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన హోమం భక్తుల హృదయాలను భక్తి భావంతో నింపింది. సమస్త వైభవంతో సాగే ఈ పవిత్ర ఘట్టం ఆలయ మహత్యాన్ని ప్రతిబింబిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక పరిమళాన్ని పంచింది. దైవసన్నిధిలో నిర్వహించిన ఈ మహోత్సవం భక్తజన హృదయాల్లో అపూర్వ అనుభూతిని మిగిల్చింది.

# ఎంపీ వద్దిరాజు ఓబీసీ డిమాండ్




**హైదరాబాద్, మే 3(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అన్ని రంగాలలో తీవ్ర అన్యాయానికి, అణిచివేతకు గురవుతున్న ఓబీసీలకు చట్టసభలలో రిజర్వేషన్స్ కల్పించే సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతో పాటుగా కులగణనను కూడా చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడాన్ని తమ బీఆర్ఎస్ స్వాగతిస్తున్నదని చెప్పారు. కులగణనతో మాత్రమే సరిపెట్టకుండా, వాటి జనసంఖ్య దామాషా ప్రకారం చట్టసభల్లో రిజర్వేషన్స్ కూడా అమలుపర్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఓబీసీ వర్గానికి చెందిన ప్రధాని నరేంద్రమోడీ రిజర్వేషన్స్ ప్రవేశపెట్టి అమలుపర్చడానికి ఈ కులగణన దోహదపడుతుందని, అందుకు ఇది సరైన సమయమని ఎంపీ వద్దిరాజు అభిప్రాయపడ్డారు. హైదరాబాద్ గచ్చిబౌలి యశోదా ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఏర్పాటు చేసిన కాపు ఆత్మీయ సమ్మేళనానికి ఎంపీ రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల జరిపించిన సర్వేలో బాగా తొండి (తప్పులు) జరిగిందని మున్నూరుకాపు, ఇతర బీసీ కులాల జనాభాను 50లక్షల వరకు తక్కువ చేసి చూపడం జరిగిందని, దీనిని తాము తీవ్రంగా ఖండించడం జరిగిందన్నారు. పవన్ కళ్యాణ్ సినిమా రంగంతో పాటుగా రాజకీయంగా కూడా బాగా ఎదగడం సంతోషకరమన్నారు. ప్రాంతాలు వేరైనా కూడా కాపు, తెలగ, తూర్పు కాపు, బలిజ, ఒంటరి, మున్నూరుకాపులంతా ఒక్కటేనని, మనమందరం ఇదేవిధంగా సంఘటితంగా ముందుకు సాగితే ఇరు తెలుగు రాష్ట్రాలలో రాజకీయంగా మరింత బలపడొచ్చని ఎంపీ వద్దిరాజు చెప్పారు. మన సామాజిక వర్గానికి చెందిన వివిధ పేర్లతో పిలువబడుతున్న వారు పలు రాష్ట్రాలలో కూడా గణనీయమైన సంఖ్యలో ఉన్నారని, పార్లమెంట్ సభ్యులలో సుమారు 200 వరకు ఉండొచ్చని ఎంపీ రవిచంద్ర పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి రాంమోహన్ రావు తదితర కాపు ప్రముఖులు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసి కోరడంతో ఈ పక్కనే ఉన్న విలువైన 7 ఎకరాలను కేటాయించడాన్ని ఎంపీ రవిచంద్ర గుర్తు చేశారు. కాపు, మున్నూరుకాపు, తెలగ, తూర్పు కాపు, బలిజ, ఒంటరి కులాల వారికి 6,000 రాయితీ కార్డులను యశోదా ఆస్పత్రి యాజమాన్యం అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రి ఛైర్మన్ రవీందర్ రావు ఎంపీ వద్దిరాజును శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు.ఈ సమ్మేళనంలో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# చలివేంద్రం ప్రారంభించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్




**షాద్ నగర్, మే 04(నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ గంజ్ లో కాంగ్రెస్ పార్టీ 20వ వార్డు నేత మన్నే జానకి రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ,చలివేంద్రం ను షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పట్టణంలోని గూంజ్ కు నిత్యం వచ్చే వందలాది ప్రజల దహార్తిని తీర్చేలా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, సీనియర్ నాయకుడు అగ్గనూర్ బస్వం, జృమద్ ఖాన్,కొమ్ము కృష్ణ, నర్సింహులు,ప్రదీప్ మరోటీయ, భరత్ లోహటి,వాసు,మనీష్, తదితరులు పాల్గొన్నారు.

## పాఠకులకు గమనిక:




మీరు ఎదుర్కొంటున్న సమస్యలను వివరణాత్మకంగా మాకు తెలియజేయండి. ప్రభుత్వ అధికారుల మరియు ప్రజల మధ్య వారధిగా నిలిచి, మా ప్రత్యేక విలేకరుల బృందం సంబంధిత అధికారులను సంప్రదించి, పరిష్కారం కోసం కృషి చేస్తుంది.

నిజం బయటికి తీయడం కోసం , నిజాయితీ కోసం నీలగిరి ఎక్స్‌ప్రెస్! న్యూస్ సంప్రదించండి.

అన్నివేళలా మీతో పాటు ఉంటుంది

ఇమెయిల్: neelagiriexpress@gmail.com

సంప్రదింపు నెంబర్: 9705770909

మీ ప్రతిభావంతమైన భాగస్వామ్యంతో సమాజానికి మంచి మార్పు తీసుకురావడం మా లక్ష్యం.

మీ గొంతుకకు మేమే వేదిక - నీలగిరి ఎక్స్‌ప్రెస్!

# అమనగల్లులో విద్యుత్ తీగల సమస్య





### -వ్యాపారస్తుల ఆందోళన

**అమనగల్లు, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పట్టణంలోని అంగడి బజారులో వ్యాపార దుకాణాలపై విద్యుత్ తీగలు అతి దిగువకు వేలాడుతున్న పరిస్థితి వ్యాపారస్తులను భయాందోళనకు గురిచేస్తోంది. ఈ తీగలు గాలిదుమారాలు వచ్చినప్పుడు మరింత కిందికి లంగుతూ, ఒక్క చిన్న ప్రమాదమే భారీ అపాయానికి దారి తీసేలా మారుతున్నాయని వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దుకాణదారులు పలుమార్లు విద్యుత్ శాఖ అధికారులకు సమస్యను వివరించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాపోతున్నారు. తీగలు లూజుగా ఉండటంతో, ఇవి గాలిలో తాకినప్పుడు నిప్పులు చేరిగేలా మారుతాయని, దాంతో షార్ట్‌సర్క్యూట్ ప్రమాదం పొంచి ఉందని వారు చెప్పుకొస్తున్నారు. ఈ పరిస్థితిపై లిఅమనగల్లు కిరాణా షాప్ సంఘం అధ్యక్షుడు కండె పాండురంగయ్యలి స్పందిస్తూ, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా అధికారుల నుంచి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. ప్రజలకు, వ్యాపారస్తులకు సురక్షిత విద్యుత్ సేవలు అందించడానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. "ప్రమాదం సంభవించకముందే... తగిన చర్యలు చేపట్టాలి" అంటూ వ్యాపారులు అధికారులను కోరుతున్నారు. ఇలాంటి సమస్యలు వేగంగా పరిష్కారం కావాలని స్థానిక ప్రజలు ఆశిస్తున్నారు.

# గిరిజన జాతిని సినీ నటుడు అవమానించడం అత్యంత బాధాకరం

-సినీ నటుడు విజయ్ దేవరకొండపై షాద్ నగర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు

-పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన లంబాడి హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్




**షాద్ నగర్, మే 04 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

వందలాది మంది అభిమానులు కలిగిన సినీనటుడు విజయ్ దేవరకొండ గిరిజన జాతిని అవమానించడం అత్యంత బాధాకరమైన విషయమని లంబాడి హక్కుల పోరాట సమితి షాద్ నగర్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్ అన్నారు. ఎంతో ఉన్నత విలువ కలిగిన మరిము సంస్కృతి అచారాలు ఇప్పటికి పాటిస్తున్న ఏకైక జాతి బంజార(ట్రైబల్) అంటూ అలాంటి గిరిజన జాతిని ఒక సినిమా వేడుకల్లో భాగంగా కించపరిచినట్లు మాట్లాడడం, గిరిజన జాతి ప్రజల మనోభావాలు దెబ్బ తినే విధంగా ఆయన మాట్లాడిన తీరు, ఇంత పెద్ద నటుడు ఈవిదంగా మాట్లాడడం అవమానంగా భావిస్తూ అతనిపై తగు చర్యలు తీసుకోవాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ కోరిక మేరకు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు లంబాడి హక్కుల పోరాట సమితి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్ తెలిపాడు. ఫిర్యాదు చేసిన ప్రధాన కార్యదర్శి మోహన్ నాయక్ వెంట ఫరూక్నగర్ మండల అధ్యక్షులు పి సంతోష్ నాయక్, షాద్నగర్ పట్టణ అధ్యక్షుడు పి చందర్ నాయక్, కేశంపేట మండల అధ్యక్షుడు జర్పుల రాజు నాయక్, కొత్తూరు మండల అధ్యక్షుడు బాబురాజ్ నాయక్, నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి పరశు రాం నాయక్, శ్రీనివాస్ అంబాదాస్ తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల అభివృద్ధికి ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలి.

-న్యాయం కోసం... మే 13న డైరెక్టర్ కార్యాలయం ముట్టడి

-ప్రభుత్వ ఉద్యోగాల్లో రోస్టర్ 10లోపు మార్చాలి



**హైదరాబాద్, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ రాష్ట్రంలో లక్షలాది వికలాంగులు న్యాయహక్కుల కోసం పోరాడుతున్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్రస్థాయి పిలుపు మేరకు మే 13న వికలాంగుల సంక్షేమ శాఖ డైరెక్టర్ కార్యాలయం ముట్టడి చేపట్టనున్నట్లు రంగారెడ్డి జిల్లా వికలాంగుల జాతీయ వేదిక అధ్యక్షుడు ఆశన్న గారి భుజంగారెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో రోస్టర్ 10లోపే ఉండేలా మార్చాలని, వికలాంగుల సంక్షేమానికి ప్రత్యేక కమిషన్, కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వే ప్రకారం 10.48 లక్షల మంది వికలాంగులుండగా, కేవలం 4,90,044 మందికే పెన్షన్లు లభిస్తున్నాయి. చట్టం (2016), మెంటల్ హెల్త్ కేర్ యాక్ట్ (2017) అమలులో విఫలమవుతున్నట్టు వేదిక పేర్కొంది. వికలాంగులపై జరుగుతున్న దాడులు, లైంగిక వేధింపులు పెరుగుతున్నాయని, మహిళా వికలాంగుల రక్షణపై ప్రభుత్వం దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. విద్యా రంగంలో స్పెషల్ విద్యా సంస్థలు లేకపోవడం వల్ల చాలా మంది వికలాంగ విద్యార్థులు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో ప్రమోషన్లలో రిజర్వేషన్లు అమలవ్వడం లేదని, వికలాంగుల వివాహ ప్రోత్సాహకాన్ని రూ. 2 లక్షలకు పెంచాలని, ఇద్దరు వికలాంగులు పెళ్లి చేసుకుంటే రూ. 5 లక్షల ప్రోత్సాహకం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మోటరైజ్డ్ వాహనాలు, పరికరాల పంపిణీ, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి మౌలిక సదుపాయాలు అందించాలని కోరారు. ప్రతి మండలంలో భవిత్ సెంటర్లు ఏర్పాటు చేసి, మండల సమాఖ్యల ఆధ్వర్యంలో నడుస్తున్న ఎం. హెచ్. సి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తీవ్ర వైకల్యం కలిగిన వారికి ప్రత్యేక అలవెన్స్ రూ. 25,000 ఇవ్వాలని వేదిక డిమాండ్ చేసింది. వికలాంగుల సమస్యలపై ప్రభుత్వం తీవ్రంగా నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపిస్తూ, తక్షణ చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

# కల్వకుర్తి లో ఘనంగా శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు





**కల్వకుర్తి, మే 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**


కల్వకుర్తి పట్టణ మున్సిపాలిటీ లో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి ముందుగా కల్వకుర్తి పట్టణ నందు బైక్ ర్యాలీ నిర్వహించారు విద్యానగర్ భగీరథ భవన్ నందు గల భగీరథ విగ్రహానికి పూలమాలవేసి ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై సగర నాయకులు మాట్లాడుతూ.. మన భారతదేశంలో సూర్యవంశం మరియు ఇక్ష్వాక వంశంలో ప్రఖ్యాతి చెందిన మహారాజు సగర చక్రవర్తి అతని మనుమడు అంశు మంతుడు మరియు అతని కుమారుడు దిలీప చక్రవర్తి ఆ దిలీప చక్రవర్తి కుమారుడే భగీరథుడు అని అన్నారు భగీరథుడు హిమశిఖరం పై కూర్చుని కఠోర తపస్సుదీక్ష పట్టుదల వలన గంగను దివి నుంచి




భువికి శివుని మెప్పించి తన పూర్వజు లందరినీ సజీవితులుగా పరివర్తన గావించాడు అట్టి భగీరథుని వంశస్తుడు దశరథుడు దశరథ మహారాజు యొక్క సంతానమే శ్రీరామచంద్రుడు శ్రీరాముని వారసుడే హరిశ్చంద్రుడు. సగరులు ఇంతటి గొప్ప చారిత్రిక వారసులమని గర్వించాలి అని అన్నారు ప్రతి ఒక్కరూ భగీరథసాధనతో జీవించాలి అని అన్నారు సగరులంతా ఐకమత్యంగా ఉండి మన హక్కులను కాపాడుకోవాలని అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఆనంద్ కుమార్,బీసీ సబ్ ప్లాన్ నాయకులు మేకల రాజేందర్, గోపాల్,జేఏసీ చైర్మన్ సదానందం గౌడ్, సగర సంఘం రాష్ట్ర జిల్లా మండల పట్టణ యువజన నాయకులు మరియు సగర బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# కడ్తాల్ మండల జర్నలిస్ట్ సంఘం అధ్యక్షుడిగా రామకృష్ణ

మండల జర్నలిస్టుల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గం ఎన్నిక



**కడ్తాల్, మే 04(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల జర్నలిస్టుల సమావేశం ఆదివారం మైసిగండి మైసమ్మ ఆలయం వద్ద నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని వివిధ పత్రికల విలేకరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో జర్నలిస్టుల సమస్యలపై చర్చించారు. అనంతరం మైసిగండి మైసమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అదే విదంగా నూతన కార్యవర్గాన్ని ఆలయ నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్బంగా నూతన గౌరవ అధ్యక్షులు తిరుపతి గౌడ్, అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. తమపై నమ్మకం ఉంచి తమ ఎన్నికకు సహకరించిన పాత్రికేయ మిత్రులకు ధన్యవాదాలు తెలిపారు. కడ్తాల్ మండల విలేకరుల సమస్యలు, హక్కుల సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని తెలిపారు.

**కడ్తాల్ జర్నలిస్ట్ సంఘం ఎన్నిక ఇలా..**

గౌరవ అధ్యక్షులుగా తిరుపతి గౌడ్, అధ్యక్షులుగా రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గిరిధర్, కార్యదర్శిగా సురేందర్ గౌడ్, కోశాధికారిగా మహేష్ తో పాటు మరి కొందరు సభ్యులుగా ఎన్నుకున్నారు.

# ఘనంగా శ్రీ శ్రీ శ్రీ మహర్షి భగీరథ జయంతి

**వికారాబాద్ మే 4(నీలగిరి ఎక్స్ ప్రెస్):**

జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ శ్రీ శ్రీ మహర్షి భగీరథ జయంతిని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధర్యంలో నిర్వహించడం జరిగినది. ఇట్టి కార్యక్రమానికి, జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి కె.ఉపేందర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎన్.భీమ్ రాజ్ వసతి గృహ సంక్షేమ శాఖ అధికారులు, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొనీ ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగినది.



# వేసవిలో వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలి

## -జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి,మే 4 ( నీలగిరి ఎక్స్ ప్రెస్ ):** వేసవిలో భానుడి ప్రతాపం రోజు రోజుకి తీవ్రరూపం దాల్చి ప్రజలను అనారోగ్యానికి గురయ్యేలా చేస్తున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.
వేసవికాలం ఎక్కువగా ఇబ్బంది పెట్టే సమస్య వడదెబ్బ,అధిక ఉష్ణోగ్రతలు, ఉక్కపోత కారణంగా బయట పనికి వెళ్లే వాళ్లే కాకుండ ఇంట్లో ఉండే వృద్ధులు, పిల్లలు సైతం వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంటుందని సూచించారు. ఈ సందర్భంగా కొన్ని జాగ్రత్తలు పాటించి వడదెబ్బ తగలకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఉదయం నుండి 12 గంటల లోపే బయటి పనులు పూర్తి చేసుకోవాలని, అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న వేళల్లో బయటకు వెళ్లకపోవడం మంచిదని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో వెళ్లవలసివస్తే నెత్తికి టోపి లేదా గొడుగు వెంట తీసుకువెళ్లాలని, వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవడం ముఖ్యమని తెలిపారు. వడదెబ్బకు గురైనప్పుడు సరైన చర్యలు తీసుకోకపోతే ప్రాణాలు కూడా కోల్పోయే ప్రమాదం ఉంటుందనీ, వేసవిలో వడదెబ్బ తగలకుండా ఉండాలంటే ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలని, ముఖ్యంగా చల్లటి నీరు, ఓఆర్ఎస్ ద్రావణం, పండ్ల రసాలు తీసుకోవడం, తేలికైన దుస్తులు ధరించడం చాలా ముఖ్యమని పేర్కొన్నారు. వడదెబ్బ లక్షణాలు (తలనొప్పి, వాంతులు, మైకము, అధిక జ్వరం, తల తిరగడం, స్పృహ కోల్పోవడం) కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలని, పిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని వీలైనంతవరకు ఇంట్లోనే ఉండటం మంచిదని సూచించారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**
-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**
-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.

చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.
చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# కడ్తాల్‌లో 'జై బాబు - జై భీమ్ - జై సంవిధాన్' కార్యక్రమం








**కడ్తాల్, మే 4(నీలగిరి ఎక్స్‌ప్రెస్)** కడ్తాల్ మండల పరిధిలోని చల్లంపల్లి గ్రామంలో 'జై బాబు - జై భీమ్ - జై సంవిధాన్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. చల్లా సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెసు పార్టీ ప్రవేశపెట్టిన ఉచిత బస్సు, సన్న బియ్యం పథకం, ఉచిత గ్యాస్ సిలిండర్, నిరుద్యోగులకు 'రాజీవ్ వికాస' పథకాలు వంటి సంక్షేమ కార్యక్రమాలు సామాన్య ప్రజలకు అమూల్యమైన ప్రయోజనం కలిగిస్తున్నాయన్నారు. రైతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి కోసం అనేక చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా చల్లంపల్లి గ్రామానికి రోడ్డు నిర్మాణం, బస్సు సౌకర్యం కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అలాగే గ్రామపంచాయతీ ఉద్యోగుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ విధానాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన పేర్కొన్నారు. గడప గడప తిరిగి ప్రజలకు అవగాహన కల్పిస్తూలి, కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ముందుండి పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు శ్రీనివాస్ గౌడ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లేపల్లి జగన్, మార్కెట్ చైర్‌పర్సన్ యాట గీత, వైస్ చైర్మన్ నరసింహ, భాస్కర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బిక్య నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్, మాజీ సర్పంచ్ నరేందర్, మాజీ ఎంపిటిసి పర్వతాలు యాదవ్, గ్రామ కిసాన్ సెల్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, మండల అధ్యక్షుడు బాలరాజ్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎగ్బాల్ పాషా, రాయికంటి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాత్రి వేళలో పోలీసుల విస్తృత తనిఖీలు






**వెల్దండ మే 4 ( నీలగిరి ఎక్ప్రెస్)** వెల్దండ మండల కేంద్రంలో ఎస్సై కురుమూర్తి ఆధ్వర్యంలో హైదరాబాద్ శ్రీశైలం హైవేపై రాత్రి పోలీసులు అకస్మిక తనిఖీలు చేపట్టడం జరిగింది తనిఖీలు చేపట్టడం వల్ల అసాంఘిక కార్య కార్యకలాపాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని అదేవిధంగా దొంగతనాలకు పాల్పడే వారిని నిరోధించవచ్చని పోలీసులు తెలిపారు పోలీసులు తనిఖీలు చేయడం వల్ల పోలీసులపై ప్రజలకు విశ్వాసం ఏర్పడుతుందని ప్రజలకు మేమున్నామని భరోసా కల్పిస్తూ వెల్దండ పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టడం జరుగుతుంది పోలీసుల తనిఖీ వల్ల పోలీసులపై ప్రజలకు విశ్వాసం పెంపొందించగలుగుతామని వివరించారు ఏఎస్ఐ జకి ఉల్లా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రవి కానిస్టేబుల్ శీను రాఘవేందర్ శివకుమార్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు

# కుత్బుల్లాపూర్‌లో అభివృద్ధికి మరో ముందడుగు





**కుత్బుల్లాపూర్, మే 4(నీలగిరి ఎక్స్ ప్రెస్)** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజుల రామారం 125 - డివిజన్ ఉషోదయ కాలనీ ఫేజ్ -1లో 40 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును బీఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్, మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ అభివృద్ధే తమ లక్ష్యమని, మౌలిక వసతుల కల్పనకు ఏ నిధులనైనా కేటాయించి ప్రజలకు అత్యుత్తమ సౌకర్యాలు అందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం పని చేస్తున్నామని, ప్రతి కార్యక్రమం ప్రజా అవసరాలను దృష్టిలో పెట్టుకునే చేపడుతున్నామని పేర్కొన్నారు. సీసీ రోడ్డు ప్రారంభోత్సవ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, పాక్స్ డైరెక్టర్ పరిశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షుడు విజయ్ రాంరెడ్డి, సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, అడ్వకేట్ కమలాకర్, నవాబ్ భాయ్, ఇబ్రహీం ఖాన్, తెలంగాణ సాయి, చెట్ల వెంకటేష్, సుంకరి చందు, చిన్నా చౌదరి, బాబీ చౌదరి, ఆంజనేయులు, రాములు గౌడ్, వహీద్, దూలప్ప, బోయిని మహేష్, శివ నాయక్, ప్రసాద్, ఉషోదయ కాలనీ - 1 వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.వి.ఎస్. సురేంద్రనాథ్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సతీష్ బాబు, కోశాధికారి నరసింహ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి రాజేంద్ర ప్రసాద్, సలహాదారు బాల్ రెడ్డి, గురుప్రసాద్ రావు, కాలనీ వాసులు రసూల్ తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షుడు కీర్తిశేషులు కేజీ మూర్తి సతీమణి మృతి

## -నివాళులు అర్పించిన ఎమ్మెల్యే.మేఘారెడ్డి



**వనపర్తి ,మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ మాజీ అధ్యక్షులు కీర్తిశేషులు కేజీ మూర్తి సతీమణి భారతి మృతి చెందిందన్న విషయాన్ని తెలుసుకున్న వనపర్తి శాసనసభ్యులు.తూడి మేఘారెడ్డి ఆదివారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన భారతి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.కుటుంబ సభ్యులను ఓదారుస్తూ సానుభూతి తెలిపారు.కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 128 కోట్ల రూపాయలతో మధిర పట్టణం ఆధునికరణ

**మధిర,మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మధిర పట్టణం ఆధునిక వసతులతో కూడిన అద్భుతమైన నగరంగా మధిర ను తీర్చిదిద్దడం కోసం 128 కోట్ల రూపాయలతో మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ నిర్వహించి పనులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రారంభించారు. మధిర పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ఏర్పాటు కావాలన్నా ప్రజల చిరకాల కోరిక ప్రజా ప్రభుత్వంలో సాకారం అవుతుందని అన్నారు.

# సీనియర్ న్యాయవాది మృతికి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సంతాపం

**కొత్తగూడెం మే 04: మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):** సీనియర్ న్యాయవాది ఆళ్ల గురు ప్రసాద్ రావు మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సంతాపం తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని ఆదివారం సందర్శించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, పోసాని రాధాకృష్ణమూర్తి, సింగరేణి కాలరీస్ లీగల్ అడ్వైజర్ వెల్లంకి వెంకటేశ్వరరావు, చంద్ర నాగేంద్రబాబు, న్యాయవాదుల గుమస్తాలు కె.వెంకటేశ్వరరావు, రాజేష్‌లు తదితరులు పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాది ఆళ్ల గురు ప్రసాద్ రావు సేవలను వారు స్మరించుకుంటూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# బిజినెస్

## భారీగా తగ్గుతున్న బంగారం రేట్లు..
### తగ్గింపునకు ప్రధాన కారణాలివే..!



మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఇటీవల కాలంలో ప్రపంచ మార్కెట్‌లో బంగారం ధరలు భారీగా తగ్గుతున్నాయి. ప్రపంచ మార్కెట్లో గత 10 రోజుల్లో బంగారం ఔన్సుకు 300 డాలర్ల వరకు తగ్గింది. అంటే ఔన్సుకు 3500 డాలర్ల నుంచి నుండి 3200 డాలర్లకు పడిపోయింది. బంగారం ధర తగ్గడానికి అమెరికా, చైనా ప్రధాన కారణాలుగా ఉన్నాయి. కార్మిక దినోత్సవం కారణంగా చైనాలో మే 5 వరకు సెలవులు ఉన్నాయి. దీని కారణంగా డిమాండ్ పడిపోయింది. దీంతో పాటు, అమెరికాలో సంతృప్తికరమైన ఉపాధి గణాంకాలు, అమెరికా-చైనా సుంకాల యుద్ధంలో సడలింపు సంకేతాలు, త్వరలో కొత్త ఒప్పందం కుదుర్చుకుంటుందనే ఆశల నేపథ్యంలో బంగారం ధరలను తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. అయితే భవిష్యత్తులో ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితి సంకేతాలు కనిపిస్తున్నాయని, అందువల్ల పెద్ద క్షీణతకు అవకాశం లేదని మరికొంత మంది చెబుతున్నారు. బంగారం ధరలు తగ్గడానికి అనేక ప్రధాన కారణాలు ఉన్నాయి. ప్రపంచ వాణిజ్య చర్చలపై మార్కెట్ సెంటిమెంట్ మెరుగుపడటంతో ఈ వారం బంగారం ధరలు తగ్గాయి. భారతదేశం, జపాన్, దక్షిణ కొరియా, చైనాలతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకునే అవకాశాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ లేవనెత్తారు. చైనాకు సంబంధించిన సోషల్ మీడియా పోస్టులు అమెరికా సుంకాలపై చర్చలను తిరిగి ప్రారంభించిందని పేర్కొన్నాయి. ఇది కాకుండా చైనాలో సెలవుల వల్ల కూడా బంగారం ధరలు తగ్గాయని నిపుణులు చెబుతున్నారు. చైనాలో కార్మిక దినోత్సవ సెలవుల కారణంగా మే 1 నుంచి 5 వరకు మార్కెట్ మూసిశారు. ప్రపంచంలోనే అత్యధికంగా బంగారం వినియోగించే దేశం చైనా కాబట్టి ఈ కాలంలో డిమాండ్ తగ్గింది. అమెరికాలో ఉపాధి నివేదిక కూడా బంగారం ధరలపై ప్రభావం చూపింది. ఏప్రిల్‌లో అమెరికాలో 1.77 లక్షల కొత్త ఉద్యోగాలు సృష్టించారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఈ వారం బంగారం క్షీణత వార్తల్లో నిలిచినప్పటికీ బంగారానికి దీర్ఘకాలిక మద్దతు బాగా ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. దానిని బలపరిచే అనేక అంశాలు ఉన్నాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితులు నేపథ్యంలో బంగారం ధరలు ఇంక తగ్గవని కొంత మంది నిపుణులు చెబుతున్నారు.

## ఇప్పటికీ జనాల వద్ద రూ.2 వేల నోట్లు..
### ఆర్బీఐ తాజా అప్‌డేట్ ఏంటంటే..




మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
సుమారు రెండేళ్ల క్రితం భారతీయ రిజర్వ్ బ్యాంకు రూ.2 వేల నోటును ఉపసంహరించింది. అయితే, ఇప్పటికీ జనాల వద్ద రూ.6,266 కోట్ల విలువైన రూ.2 వేల నోట్లు ఉన్నట్టు ఆర్‌బీఐ పేర్కొంది. 2023 మే 19న ఆర్బీఐ ఈ నోట్లను ఉపసంహరించుకున్న విషయం తెలిసిందే. ఆర్‌బీఐ తెలిపిన వివరాల ప్రకారం, నోటు ఉపసంహరణ ప్రకటన సమయంలో ప్రజల వద్ద రూ.3.56 లక్షల విలువైన రూ.2 వేల నోట్లు ఉన్నాయి. ఏప్రిల్ 30 నాటికి అవి రూ.6,266 కోట్లకు పడిపోయాయి. చెలామణిలో ఉన్న మొత్తం రూ.2 వేల నోట్లలో రూ.98.24 శాతం ప్రజలు తిరిగిచ్చేశారని ఆర్‌బీఐ వెల్లడించింది. ఈ నోట్లను బ్యాంకుల్లో మార్చుకునే అవకాశం 2023 అక్టోబర్ 7తోనే ముగిసింది. అయితే, ఆర్బీఐ ఆఫీసుల్లో ఈ నోట్లను మార్చుకుని తమ అకౌంట్లల్లో డిపాజిట్ చేసుకునే అవకాశం ఇప్పటికీ ఉంది. మొత్తం 19 ఆర్‌బీఐ కేంద్ర కార్యాలయాల్లో ఈ సదుపాయం ఉంది. ప్రజలు తమ వద్ద ఉన్న నోట్లను రూ.2 వేల నోట్లను ఇండియన్ పోస్టు ద్వారా ఆర్బీఐకి పంపించే అవకాశం కూడా ఉంది.నోట్ల డీమోనెటైజేషన్‌లో భాగంగా భారతీయ రిజర్వ్ బ్యాంకు 2016 నవంబర్ 8న రూ. వేల నోట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. బ్లాక్ మనీ, అవినీతి, నకిలీ కరెన్సీలకు బ్రేకులు వేసేందుకు ప్రభుత్వం నోట్ల రద్దు ప్రకటించింది. అయితే, నోట్ల రద్దుతో వచ్చే కరెన్సీ కొరతను అధిగమించేందుకు ప్రభుత్వం ఈ కొత్త పెద్ద నోట్లను ప్రవేశపెట్టింది. కొత్త మహాత్మా గాంధీ సిరీస్ నోట్లలో భాగంగా అత్యాధునిక సెక్యూరిటీ ఫీచర్లతో ఈ నోటును ప్రభుత్వం విడుదల చేసింది. దేశ అవసరాలకు సరిపడా ఇతర డినామినేషన్‌ల కరెన్సీ నోట్లు అందుబాటులో ఉండటంతో ప్రభుత్వం రూ.2 వేల నోటును సర్క్యులేషన్ నుంచి ఉపసంహరించుకుంది. మరోవైపు, డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించేందుకు కూడా అనేక చర్యలు తీసుకుంది. ప్రస్తుతం యూపీఐ ఆధారిత చెల్లింపులు వేగంగా పెరుగుతున్న విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం ఈ విధానానికి ఇతర దేశాల్లో కూడా ప్రాచుర్యం కల్పించేందుకు ప్రయత్నిస్తోంది.

## ఎస్బీఐలో 18 వేల ఉద్యోగాలు
### -బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి వెల్లడి




న్యూఢిల్లీ, మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) భారీ స్థాయిలో ఉద్యోగులను నియమించుకోవడానికి సిద్ధమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 18 వేల మంది సిబ్బందిని నియమించుకోనున్నట్టు బ్యాంక్ చైర్మన్ సీఎస్ శెట్టి తెలిపారు.ఆర్థిక ఫలితాల విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2025-26 ఆర్థిక సంవత్సరంలో కొత్తగా 18 వేల మంది సిబ్బందిని రిక్రూట్ చేసుకోనున్నట్టు, వీరిలో 13,400 మంది క్లరికల్ కాగా, మరో 3 వేల మంది ప్రొబెషనరీ ఆఫీసర్లు, 1,600 మంది స్పెషలిస్ట్ ఆఫీసర్ స్థాయి సిబ్బందని పేర్కొన్నారు. ఈ నూతన ఆర్థిక సంవత్సరంలోనూ నికర వడ్డీ మార్జిన్లు మరింత తగ్గుముఖం పట్టే అవకాశాలున్నాయని, రిజర్వుబ్యాంక్ ఇటీవల తగ్గించిన వడ్డీరేట్లే కారణమన్నారు. గడిచిన ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో బ్యాంక్ నికర లాభం 10 శాతం తగ్గి రూ.18,643 కోట్లకు పరిమితమవగా, ఆదాయం రూ.1,43,876 కోట్లకు చేరుకున్నట్టు వెల్లడించింది.

## ఐపీఎల్‌లో విరాట్ అరుదైన ఫీట్..
### క్రిస్ గేల్, రోహిత్ స్పెషల్ క్లబ్‌లో ధోనీ..!



మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఐపీఎల్‌లో భాగంగా శనివారం జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌ను రెండు పరుగుల తేడాతో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఓడించింది. ఆర్‌సీబీ ఆడిన 11 మ్యాచుల్లో ఇది ఎనిమిదో విజయం. ఈ విజయంతో బెంగళూరు జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి చేరింది. టాస్ ఓడిన బెంగళూరు జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 213 పరుగులు చేసింది. చెన్నై జట్టు 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 211 పరుగులు మాత్రమే చేయగలిగింది. బెంగళూరు తరఫున జాకబ్ బెథెల్ 33 బంతుల్లో 55 పరుగులు చేశాడు. ఇక విరాట్ కోహ్లీ 33 బంతుల్లో 62 పరుగులు చేశాడు. ఇది ఐపీఎల్‌లో కోహ్లీకి 62వ హాఫ్ సెంచరీ చేశాడు. ఈ సీజన్‌లో 500 పరుగులు కూడా పూర్తి చేశాడు. ఈ లీగ్‌లోని 18 సీజన్ల చరిత్రలో అత్యధికంగా 500 పరుగులు సాధించిన బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. అదే సమయంలో మహేంద్ర సింగ్ ధోని, క్రిస్ గేల్, రోహిత్ స్పెషల్ క్లబ్‌లో చేరాడు. ఈ సీజన్‌లో కోహ్లీ 500 పరుగులు చేశాడు..
కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్ల సహాయంతో హాఫ్ సెంచరీ చేశాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11 ఇన్నింగ్స్‌లలో 63.12 సగటు, 143.47 స్ట్రయిక్ రేట్‌తో 505 పరుగులు చేశాడు. ఈ సమయంలో 44 ఫోర్లు, 18 సిక్సర్లు బాదాడు. కోహ్లీ ఒక సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేయడం ఇది ఎనిమిదోసారి. కింగ్ కోహ్లీ అంతకు ముందు 2011, 2013, 2015, 2016, 2018, 2023, 2024 సీజన్‌లో 500 కంటే ఎక్కువ పరుగులు చేశాడు. డేవిడ్ వార్నర్ సైతం ఏడుసార్లు కంటే ఎక్కువగా 500 పరుగులు చేశాడు. ఆ తర్వాత కేఎల్ రాహుల్ ఆరుసార్లు, శిఖర్ ధావన్ ఐదుసార్లు కంటే 500 కంటే ఎక్కువ పరుగులు చేశాడు.

**సీఎస్‌కేపై కోహ్లీ అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా..**

సీఎస్‌కేపై అత్యధిక పరుగులు చేసిన ప్లేయర్‌గా విరాట్ నిలిచాడు. చెన్నైపై కోహ్లీ 1160 పరుగులు, ఢిల్లీపై 1154 పరుగులు చేశాడు. టీ20లో ఒకే జట్టుపై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడు విరాట్ ఈ ఘనత సాధించాడు. విరాట్ తర్వాత డేవిడ్ వార్నర్ పంజాబ్ కింగ్స్‌పై అత్యధికంగా 1134 పరుగులు చేశాడు. శిఖర్ ధావన్ చెన్నైపై ధావన్ 1105 పరుగులు చేశాడు. కోహ్లీ జట్టు 18 సీజన్లలో తొలిసారిగా ఐపీఎల్ సీజన్‌లో లీగ్ దశలో రెండు మ్యాచుల్లో సీఎస్‌కేని ఓడించింది. బెంగళూరులో ఇరు జట్ల మధ్య జరిగిన చివరి నాలుగు మ్యాచులో మొదట బ్యాటింగ్ చేసిన జట్టు నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచింది.


## కేకేఆర్ సంచలన విజయం
### ఒత్తిడిలో చిత్తయిన రాజస్తాన్..



మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
రాజస్తాన్ రాయల్స్ జట్టు మరోసారి ఒత్తిడిలో చిత్తయింది. చివరి బంతికి మూడు పరుగులు చేయలేక విజయానికి దూరమైంది. ఉత్కంఠభరితంగా జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ కేవలం ఒక్క పరుగు తేడాతో గెలుపొందింది. రాజస్తాన్ ఇలాంటి టైట్ మ్యాచ్‌లో ఓడిపోవడం ఈ సీజన్‌లో ఇది మూడోసారి. రియాన్ పరాగ్ (95) అద్భుత ఇన్నింగ్స్‌తో సత్తా చాటినా రాజస్తాన్‌ను అదృష్టం వెక్కిరించింది. దీంతో కోల్‌కతా నైట్ రైడర్స్ విజయాన్ని అందుకుంది. ప్లే ఆఫ్స్‌కు చేరే అవకాశాలను మెరుగుపరుచుకుంది. ఈడెన్ గార్డెన్స్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్, రాజస్తాన్ రాయల్స్ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కోల్‌కతా నైట్ రైడర్స్ కెప్టెన్ అజంక్య రహానే బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బ్యాటర్లందరూ తమ వంతు పాత్ర పోషించి పరుగులు చేయడంతో కోల్‌కతా నైట్ రైడర్స్ ప్రత్యర్థి ముందు భారీ టార్గెట్ ఉంచింది. డ్రూ రస్సెల్ (57) హాఫ్ సెంచరీ చేశాడు. ఓపెనర్ గుర్బాజ్ (35), కెప్టెన్ రహానే (30), రఘువంశీ (44) కీలక ఇన్నింగ్స్ ఆడారు. దీంతో కోల్‌కతా నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 206 పరుగులు చేసింది. రాజస్తాన్ బౌలర్లలో ఆర్చర్, యుధ్వీర్ సింగ్, తీక్షణ, రియాన్ పరాగ్ ఒక్కో వికెట్ తీశారు.207 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్తాన్ ఆరంభంలోనే కీలక వికెట్లు కోల్పోయింది. 71 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఆ దశలో రియాన్ పరాగ్ (95) అద్భుత ఇన్నింగ్స్ ఆడి. కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించే ప్రయత్నం చేశాడు. అతడికి హెట్‌మెయర్ (29) సహకరించాడు. అయితే పరాగ్ అవుటైన తర్వాత కోల్‌కతా పట్టు బిగించింది. అయితే చివర్లో శుభమ్ దూబే (25) కేకేఆర్‌ను భయపెట్టాడు. బౌండరీలతో విరుచుకుపడ్డాడు. చివరి బంతికి మూడు పరుగులు చేయాల్సిన దశలో కేవలం సింగిల్ మాత్రమే చేశాడు. దీంతో ఆర్‌ఆర్ ఒక్క పరుగు తేడాతో ఓడిపోయింది. 20 ఓవర్లలో 205 పరుగులు మాత్రమే చేసింది. కోల్‌కతా బౌలర్లలో వరుణ్ చక్రవర్తి, మొయిన్ అలీ రెండేసి వికెట్లు తీశారు.

# స్పోర్ట్స్

## ఐపీఎల్‌లో చరిత్ర సృష్టించిన పరాగ్..!
### ఒకే ఓవర్లో 5 సిక్సర్లు..



మే 04( నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ఐపీఎల్‌లో పవర్ హిట్టింగ్‌తో చెలరేగిపోతున్నారు కుర్రాళ్లు. బౌలర్ ఎంతటివాడైనా సిక్సర్ల మోతతో స్టేడియాలను హోరెత్తిస్తున్నారు. టైమింగ్ కుదిరిందంటే చాలు బంతిని అలవోకగా స్టాండ్స్‌లోకి పంపుతున్నారు. ఆదివారం రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ అదే పని చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్ స్పిన్నర్ మోయిన్ అలీ కి చుక్కలు చూపించాడు. వరుసగా 5 బంతుల్ని సిక్సర్లుగా మలిచాడు. లెగ్ సైడ్, స్వీప్ షాట్.. ఇలా అద్భుత షాట్లతో అలరించిన పరాగ్ అరుదైన క్లబ్‌లో చోటు సంపాదించాడు.ఐపీఎల్ చరిత్రలో ఒకే ఓవర్లో ఐదు సిక్సర్లు బాదిన ఆటగాళ్లలో ఐదో బ్యాటర్‌గా పరాగ్ రికార్డు సృష్టించాడు. తన విధ్వంసక బ్యాటింగ్‌తో అలరించిన అతడు రింకూ సింగ్ తర్వాత ఈ ఫీట్ సాధించాడు. ఐపీఎల్‌లో ఒకే ఓవర్లు ఐదు సిక్సర్ల వీరుడు మాత్రం క్రిస్ గేల్ . ఈ చిచ్చరపిడుగు 2012లో లెగ్ స్పిన్నర్ రాహుల్ శర్మను ఉతికేస్తూ ఐదుసార్లు బంతిని స్టాండ్స్‌లోకి పంపాడు. 2020లో కింగ్స్ లెవన్ పంజాబ్ పేసర్ కాట్రెల్ బౌలింగ్‌లో రాహుల్ తెవాటియా ఐదు సిక్సర్లతో రికార్డు నెలకొల్పాడు.ఈ ఘనత సాధించిన మూడో ప్లేయర్ రవీంద్ర జడేజా. చెన్నై సూపర్ కింగ్స్ ఆల్‌రౌండర్ అయిన జడ్డూ.. 2021లో ఆర్సీబీ పేసర్ హర్షల్ పటేల్ ఓవర్లో ఐదు సిక్సర్లతో విరుచుకుపడ్డాడు. ఇక.. సిక్సర్ల కింగ్‌గా పేరొందిన రింకూ సింగ్ 2023లో ఈ అరుదైన క్లబ్‌లో చేరాడు. గుజరాత్ టైటాన్స్ పేసర్ యశ్ దయాల్ వేసిన 20వ ఓవర్లో ఆఖరి 5 బంతుల్ని స్టాండ్స్‌లోకి పంపాడీ హిట్టర్. దాంతో, ఓటమి అంచున నిలిచిన కోల్‌కతా ఒక వికెట్ తేడాతో జయభేరి మోగించింది.